జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
ఆదివారం 15 నవంబర్ 2026 పేజీలు:20



పేదల ఇంటి కలకు ఇందిరమ్మ చేయూత

గరిదేపల్లి,నవంబర్14,(ప్రజా జ్యోతి):

నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్య మని కాంగ్రెస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ చాంద్ మియా అన్నారు.శనివారం కీత వారిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా రుల నిర్మాణ పనుల్లో భాగంగా ముగ్గులు పోయించారు.

వివరాలు 2లో



చదువుతోపాటు క్రీడల్లోనూ బాలికలు రాణించాలి

- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్
- బిసి బాలికల గురుకులంలో జిల్లా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

మిర్యాలగూడ, నవంబర్ 14,(ప్రజాజ్యోతి):

చదువుతోపాటు క్రీడల్లోనూ బాలికలు రాణించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) ఆకాంక్షించారు. శనివారం శ్రీనివాస్ నగర్ లోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ను ఆయన ప్రారంభించారు.బాలల దినోత్సవం సందర్భంగా ముందుగా విద్యార్థినీలకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు,చాక్లెట్లు పంపిణీ చేశారు.

– వివరాలు 2లో

గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత.. సంక్షేమానికి భరోసా!

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం..
- రాహుల్ గాంధీ చేతుల మీదుగా పథకం ప్రారంభం..
- సంక్షేమ పథకంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం..





నల్గొండ నవంబర్ 14,(ప్రజా జ్యోతి):

గిగ్ వర్కర్ల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక భద్రతకు భరోసా కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకాన్ని' ప్రారంభించింది. హైదరాబాద్‌లో వేలాది మంది గిగ్ వర్కర్ల సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులతో కలిసి రాహుల్ గాంధీ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత, సంక్షేమం, గౌరవప్రదమైన భవిష్యత్తు కల్పించే దిశగా ఈ పథకం ముందడుగు అని మంత్రి పేర్కొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి..

- నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి..
- నిందితులకు శిక్ష పడేలా పక్కా ఆధారాలు సేకరించాలి..
- ఈ-సాక్ష్య యాప్‌ను వినియోగించాలి..
- పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన..
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



రైతులకు ప్రత్యామ్నాయ పంటలతోనే అధిక లాభాలు..

- మారుతున్న వాతావరణానికి అనుగుణంగా సాగు మార్పులు చేసుకోవాలి..
- రైతులకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుంది..
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ - అఖిల భారత కిసాన్ సభ

ఆధ్వర్యంలో మూడు రోజుల వ్యవసాయ ప్రదర్శన..

నల్గొండ, నవంబర్ 14 (ప్రజాజ్యోతి):

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.శనివారం నల్గొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల వ్యవసాయ ప్రదర్శన (అగ్రి షో)ను నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.

– వివరాలు 2లో



రైతులకు ప్రత్యామ్నాయ పంటలతోనే అధిక లాభాలు..







మొదటిపేజీ తరువాయి

ప్రదర్శనలో ఏర్పాటు చేసిన 120 స్టాళ్లను సందర్శించి ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, నూతన సాగు పద్ధతులు, వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని పంటలు ఎంచుకోవాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో పాటు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను అవలంబించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 14 వేల ఎకరాల్లో నూనెగింజల పంటలు సాగు చేస్తున్నామని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. పంటలను ప్రాసెసింగ్ చేసి నేరుగా మార్కెట్‌లో విక్రయించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని, రైతు సంఘాలు, మహిళా సంఘాలు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతు దేశానికి వెన్నెముక అని అన్నారు. ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలతో అండగా నిలుస్తోందని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో పండే పంటలు సాగు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విష్ణు కృష్ణ, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుకు సీతారాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, మల్లు లక్ష్మి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, జూలకంటి రాజేందర్, ప్రమీల, స్టాళ్ల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ బాలికలు రాణించాలి

మొదటిపేజీ తరువాయి

అనంతరం స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించి విద్యార్థినీలతో కలిసి పలు క్రీడల్లో సరదాగా పాల్గొని వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు పాల్గొనాలని, జిల్లా.





రాష్ట్ర, జాతీయస్థాయి లో ప్రతిభ చూపి పాఠశాలకు తల్లిదండ్రులకు గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడల వలన శారీరక మానసిక దృఢత్వం పెంచడంతోపాటు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను చాటి లక్ష్యాలను సాధించాలన్నారు. ఉపాధ్యాయులు చదువుతోపాటు విద్యార్థులను క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని, శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, సీనియర్ నాయకుడు గుడిపాటి నవీన్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పేదల ఇంటి కలకు ఇందిరమ్మ చేయూత

మొదటిపేజీ తరువాయి

మంత్రి ఉత్తమ్ కుమార్ రె డ్డి సహకారం తో పేదలకు రూ.5లక్షల ఆర్థిక సాయంతో ఇళ్లు మంజూరయ్యా యని తెలిపారు.లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించా రు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండారు సైదులు,ఎస్కే సఫి యా మీరా,బండారు అంజయ్య,లబ్ధి దారులు మెరిగా రేణుక,రేఖ సైదులు, కొమరాజు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి..

మొదటిపేజీ తరువాయి

నల్గొండ, నవంబర్ 14 (ప్రజాజ్యోతి):

జిల్లాలో పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులకు శిక్ష పడేలా పక్కా ఆధారాలు సేకరించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కేసులో నాణ్యమైన, శాస్త్రీయ దర్యాప్తు చేపట్టాలని, ఈ-సాక్ష్య యాప్, సీసీటీఎన్ఎస్ సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా పెంచడంతో పాటు బీట్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని, సీసీ కెమెరాల ఏర్పాటును విస్తరించాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇసుక అక్రమ మైనింగ్, పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ప్రజలకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు మల్లారెడ్డి, శివరాం రెడ్డి, శ్రీనివాస్ రావు, లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్సై లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



వినూత్నంగా బాలల గ్రామసభ

- చిన్నారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక..

నూతన ఒరవడికి శ్రీకారం

- నోములలో ఘనంగా బాలల గ్రామసభ.. విద్యార్థులతో ముఖాముఖిగా అధికారులు





నల్లగొండ నవంబర్ 14 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

నకిరేకల్ మండలం నోముల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాలల గ్రామసభను వినూత్నంగా, ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ జయమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నకిరేకల్ ఎంపీడీవో జి. బ్రహ్మచారి హాజరై విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. జనాభాలో సుమారు 35 శాతం ఉన్న బాలల సమస్యలను గుర్తించి, వారి హక్కులకు ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బాలల గ్రామసభలను నిర్వహిస్తోందన్నారు. చిన్నారుల సమస్యలను నేరుగా తెలుసుకొని, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ఈ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బాలల గ్రామసభలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఎంఈఓ నాగయ్య పాఠశాలల్లో డ్రాపౌట్ల నివారణ, బడిలో చేరని పిల్లల అంశాలపై అవగాహన కల్పించగా, ఐసీడీఎస్ భవాని బాల్యవివాహాల నిర్మూలన, లింగ సమానత్వంపై వివరించారు. హెడ్ కానిస్టేబుల్ సైబర్ నేరాలు, డ్రైవింగ్ నిబంధనలు, గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య, డ్రాపౌట్ల నివారణ, బాల్యవివాహాల అరికట్టడం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. విద్యార్థుల సూచనల ఆధారంగా ప్రత్యేక నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామని ఎంపీడీవో తెలిపారు. తదుపరి గ్రామసభలో తీసుకున్న చర్యలపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను చర్చిస్తామని వెల్లడించారు. చిన్నారుల సమస్యలను వినడమే కాకుండా, గ్రామ అభివృద్ధి నిర్ణయాల్లో వారికి భాగస్వామ్యం కల్పించే దిశగా నిర్వహించిన ఈ బాలల గ్రామసభ నూతన ఒరవడికి నాంది పలికింది. బాలల హక్కులు, భద్రత, విద్య, సమగ్ర అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో దీప్తి సర్పంచ్ కిరణ్ కుమార్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు చెలమరాజు, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఎంపీఓ రజిత, పీఎస్ రమేష్, వార్డు సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ఘనంగా స్పోర్ట్స్ మీట్

కోదాడ టౌన్, నవంబర్ 14 (ప్రజా జ్యోతి):

కోదాడ పట్టణంలోని నారాయణ పాఠశాలలో నారాయణ ప్రీమియర్ లీగ్ (ది చాంప్స్) స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హరిత రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన అనంతరం నారాయణ స్పోర్ట్స్ జెండాను ఆవిష్కరించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు శారీరక దృఢత్వం, మానసిక వికాసం, మెదడు చురుకుదనం పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ-కిడ్స్ కోఆర్డినేటర్ మహేశ్వరి, ఏఓ వీరారెడ్డి, సెగ్మెంట్ హెడ్స్ రమణయ్య,సలీమా ఇందిరా తదితరులు పాల్గొన్నారు.





మాధవరం కలాన్‌లో గ్రామీణ పల్లె దవాఖానా ప్రారంభం







నల్లగొండ నవంబర్ 14 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

శాలిగౌరారం: తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండలం మాధవరం కలాన్ గ్రామంలో గ్రామీణ పల్లె దవాఖానాను ఘనంగా ప్రారంభించారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాలిగౌరారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ తోటకూరి పరుశరాములు ముఖ్య అతిథిగా పాల్గొని పల్లె దవాఖానాను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో పల్లె దవాఖానాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు ప్రాథమిక వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సేవలు పొందేందుకు ఈ దవాఖానాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వెంకన్న, సీహెచ్ఎస్ఓ రవి, పీఏసీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు తాళ్లూరి మురళి, మాజీ జెడ్పీటీసీ సోముల వెంకన్న, మార్కెట్ డైరెక్టర్ రాజుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సోముల జనార్ధన్, గ్రామ కార్యదర్శి బండారి శివ, ఇటుకులపహాడు ఉపసర్పంచ్ సుల్తాన్ ఎల్లయ్య, తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్, శాలిగౌరారం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇందనూరు శ్రీను, వార్డు సభ్యులు మాధగోని సైదులు, వినీత నాగరాజు, దాసరి మానస, మామిడి రాజశేఖర్, అశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలను చేరువ చేయడంలో పల్లె దవాఖానాలు మరింత దోహదపడనున్నాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

తాళ్ల వెల్లంలలో జోగు దుర్గమ్మ కుటుంబాన్ని పరామర్శించిన దైద రవీందర్

నల్లగొండ అక్టోబర్ 14 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

నకిరేకల్ నియోజకవర్గం:చిట్యాల మండలం తాళ్ల వెల్లంల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జోగు లింగస్వామి మాతృమూర్తి జోగు దుర్గమ్మ ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పరామర్శించారు.ఈ సందర్భంగా దుర్గమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జోగు సురేష్, ఉపసర్పంచ్ పామునుగుల్ల సునీత, బుచ్చి రాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జోగు చంద్రమౌళి, జంపాల వినయ్, ఏర్పుల విజయ్, అక్కెనపల్లి ఆనంద్, దొడ్డి ముత్తయ్య, నకరకంటి నరేష్, నక్క పెద్ద సైదులు, జోగు ఎల్లయ్య, జోగు నరసింహ, ఏర్పుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



జీనియస్ పాఠశాల లో విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన డా,సూర్యనారాయణ రెడ్డి

భువనగిరి, నవంబర్ 14 (ప్రజాజ్యోతి)

విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొనడం వల్ల,జీవితంలో గెలుపు ఓటములు సమానంగా తీసుకునే తత్వం ఏర్పడు తుంద ని, జాగృతి విద్యాసంస్థల చైర్మన్ జీనియస్ హైస్కూల్ కరస్పాండెంట్ డా,బి,సూర్యనారాయణ రెడ్డి అన్నారు.14 నవంబర్ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు శనివారం పాఠశాల,ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వారికి బంగారు వెండి, పత కాలు ట్రోఫీలు అందజేసి మాట్లాడారు అదేవిధంగా పాఠశాల చైర్మన్ పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు వ్యాయామం యోగ లాంటి వాటిని నిత్య సాధన చేయడం వల్ల వారి మేధస్సు పెంపొందు తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వి సుచరిత ఏవో జి రవి కోఆర్డినేటర్స్ విజయ పద్మావతి ఫాతిమా జయ రాణి మరియు సునీత రాణి జయచిత్ర ప్రసాద్ పీఈటీలు కే,శ్రీకాంత్ కే కృష్ణ జి వనజ కే,మౌనిష తదితరులు పాల్గొన్నారు..





బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, చాక్లెట్ల పంపిణీ

నల్లగొండ నవంబర్ 14: (ప్రజ జ్యోతి ప్రతినిధి)

శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, చాక్లెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి బెల్లి వీరభద్రం, పదో వార్డు సభ్యులు రాయవరపు గోపి, గ్రామ కాంగ్రెస్ శాఖ ఉపాధ్యక్షులు పోయిలపాక సురేష్, గ్రామ కాంగ్రెస్ నాయకులు గోల రవితేజ తదితరులు పాల్గొన్నారు.




విద్యా సంస్కరణలు చారిత్రాత్మకం

- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యా విధానానికి స్వాగతం

- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, గుర్రపు తండ సర్పంచ్ సేవ నాయక్

మల్లేపల్లి, నవంబర్ 14, (ప్రజా జ్యోతి):

తెలంగాణలో నర్సరీ నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న విద్యా సంస్కరణలు చారిత్రాత్మకమని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, గుర్రపు తండ సర్పంచ్ రామావత్ సేవ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర విద్యారంగంలో నూతన మార్పులకు దోహదపడతాయన్నారు. పదో తరగతి తర్వాత చదువులు ఆగిపోకుండా పన్నెండో తరగతి వరకు నిరంతర విద్యను అందించే విధానం అమలు చేయాలనే నిర్ణయం అభినందనీయమన్నారు. ముఖ్యంగా గిరిజన, దళిత, మైనారిటీ వర్గాలతో పాటు బాలికల విద్యాభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని, తెలంగాణను విద్యారంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎన్ఎస్‌యూఐ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



అయ్యప్ప స్వామి మాలధారణ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన దైద రవీందర్

నల్లగొండ నవంబర్ 14 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

మునుగోడు శాసనసభ్యులు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయ్యప్ప స్వామి మాలధారణ చేసిన సందర్భంగా, వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.



ఆర్టీఐ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడు

డా. కొర్ర కిషన్ నాయక్

మల్లేపల్లి, నవంబర్ 14,(ప్రజాజ్యోతి):

సమాచార హక్కు చట్టం--2005పై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని నల్గొండ జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, సమాచార హక్కు కార్యకర్తల సంఘం (ఆర్టీఐఏఎస్) రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర కిషన్ నాయక్ అన్నారు. విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ (వీడీఎస్) ఆధ్వర్యంలో డా. బాషా చౌహాన్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలకమన్నారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని పొందడం ప్రతి పౌరుడి హక్కు అని, చట్టంలోని నిబంధనలను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకొని సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా పారదర్శక పాలనకు బాటలు వేయవచ్చన్నారు. కార్యక్రమంలో డా. బాషా చౌహాన్, ఎన్. శాంతి, బి. నిహారిక, కె. కవిత, లహరితో పాటు శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

- పోక్సో, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి మంజుల







నల్లగొండ నవంబర్ 14: (ప్రజా జ్యోతి ప్రతినిధి)

మూసీ ప్రాజెక్ట్స్,: విద్యార్థి దశ నుంచే ప్రాథమిక హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల సూచించారు. నల్గొండ జిల్లా మూసీ ప్రాజెక్ట్‌లోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా జడ్జి మంజుల మాట్లాడుతూ పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. ఎలాంటి ఆపద ఎదురైనా పోలీసుల సహాయం ఎలా పొందాలి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సేవలను ఎలా వినియోగించుకోవాలో తెలియజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అనంతరం పాఠశాలలోని నిర్వహణ సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించిన ఆమె, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను కూడా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కేతేపల్లి మండల విద్యాశాఖ అధికారి కే. భిక్షమయ్య, న్యాయవాదులు గోవిందరాజులు, వెంకన్న, ఉదయ్ కుమార్, టైపిస్ట్ సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ వి. సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- గిద్దె రాజేష్ అరెస్టును ఖండించిన జిల్లా నాయకుడు గుర్రం నరేష్ రెడ్డి

- వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

గరిడేపల్లి,నవంబర్ 14(ప్రజా జ్యోతి):

హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవుతున్న నేపథ్యంలో తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి సూర్యాపేట జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది.ఈ మేరకు జిల్లా నాయకుడు గుర్రం నరేష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వికలాంగు లకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడుతున్న నాయకుడి ని అరెస్టు చేయడం ప్రజాస్వా మ్య హక్కులను కాలరాయడమే నని మండిపడ్డారు.అరెస్టులు, నిర్బంధాలతో వికలాంగుల ఉద్యమాలను అడ్డుకోలేరని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటువంటి చర్యలతో ఉద్యమాల ను ఆపలేరని స్పష్టం చేశారు. వికలాంగులకు పెన్షన్ల పెంపు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, పెండింగ్‌లో ఉన్న వివాహ ప్రోత్సాహకాలు,బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు.వికలాంగుల హక్కులు సాధించే వరకు,ఎన్నికల హామీలు అమలయ్యే వరకు ఆయన నాయకత్వంలో తమ పోరాటం కొనసాగుతుందని నరేష్ రెడ్డి స్పష్టం చేశారు.



16వ వారానికి చేరిన హనుమాన్ చాలీసా పారాయణం

- కొండమల్లేపల్లిలో భక్తుల ప్రత్యేక పూజలు

కొండమల్లేపల్లి, నవంబర్ 14,(ప్రజాజ్యోతి):

పట్టణంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర ఆంజనేయస్వామి, అయ్యప్ప దేవాలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణం వైభవంగా జరిగింది. విశ్వహిందూ పరిషత్, హనుమాన్ శక్తి జాగరణ సమితి, గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో గత 16 వారాలుగా ప్రతి శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులు ప్రదక్షిణలు చేసి సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. పురోహితులు పాల లగణపతి శర్మ, హనుమాన్ గురుస్వామి భక్తుల పరమ మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణం భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన, ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ స్వాములు, వింజమూరు సత్యనారాయణ, ఏరుకొండ రాము, నేలంటి వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, ఉప్పల సరస్వతి, నారాయణ, వెంకటేష్, మహేశ్వర్‌రెడ్డి, జయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎన్.జి. కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రం--1లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నల్లగొండ నవంబర్ 14: (ప్రజా జ్యోతి ప్రతినిధి)

శాలి గౌరారం మండలశీ నవంబర్ 14న ఎన్.జి. కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రం--1లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు భారత ప్రధానమంత్రి, జాతీయ నాయకుల వేషధారణలో అలరించి సందడి చేశారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సంకటి లింగయ్య, ఉపసర్పంచ్ ఓగోటి శంకర్, వార్డు సభ్యుడు పుట్ట యాదయ్య, గ్రామ పెద్దలు గంట్ల వేణుగోపాల్ రెడ్డి, సంకటి మల్లయ్య, సంకటి రవి, సంకటి కిషోర్ తదితరులు హాజరై చిన్నారులను అభినందించారు.అలాగే అంగన్‌వాడీ టీచర్లు ఓగోటి నీలిమ, గంట్ల ఇంద్ర, పుట్ట పద్మతో పాటు గ్రామ ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.





నేడు దామరచర్ల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

దామరచర్ల, నవంబర్ 14,(ప్రజాజ్యోతి):



దామరచర్ల సబ్ స్టేషన్ పరిధిలో (నేడు) ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని మండల విద్యుత్ శాఖ ఎ ఈ అబ్దుల్లా హబీబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ లో ఇంటర్ లింకింగ్ లైన్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 10 గంటలనుండి సాయంత్రం ఐదు గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని తెలిపారు. కావున గృహ,వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు విద్యుత్అంతరాయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఏ ఇ కోరారు..

నల్లబండగూడెం క్రాస్ రోడ్డులో ఘనంగా నాగ పంచమి వేడుకలు - 5 వేల మందికి అన్నదానం

కోదాడ రూరల్,నవంబర్ 14(ప్రజా జ్యోతి)





మండలంలోని నల్లబండగూడెం క్రాస్ రోడ్డులో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి పుట్ట వద్ద శనివారం నాగపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. పలువురు భక్తులు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. కుల, మత బేధాలు లేకుండా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. సుమారు 5 వేల మందికి అన్నదానం నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అన్నదానంలో దీక్షా స్వాములు పాల్గొని సద్ది స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నల్లబండగూడెం గ్రామస్తులు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు బాలల సభలు దోహదం
ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందేలా కృషి చేస్తాం
- గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి

దేవరకొండ, నవంబర్ 14, (ప్రజా జ్యోతి) :

గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాలల దినోత్సవం, ప్రత్యేక గ్రామసభ కార్యక్రమంలో భాగంగా బాలల సభను ఎంతో ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి గారు గౌరవ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం గ్రామ పంచాయతీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పాఠశాలలు, విద్యార్థులకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ బాలల సభలో పాఠశాల విద్యార్థులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేశారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యాపరమైన సమస్యలు, ఇతర అవసరాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి (ఎంఈఓ) గుడిపల్లి మాట్లాడుతూ బాలల హక్కులు, నాణ్యమైన విద్య ప్రాముఖ్యత, పిల్లల సర్వతోముఖాభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలోనే బాలల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడంలో ఇలాంటి బాలల సభలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ రెడ్డి, ఉప సర్పంచ్, పాలకవర్గ వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో



పాల్గొన్నారు. బాలల సమస్యలు, హక్కులు, విద్యాభివృద్ధిపై చర్చిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 14 (ప్రజాజ్యోతి):





పట్టణ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని పాఠశాల ఆవరణను రంగురంగుల అలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చెరుకు లింగస్వామి మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని, విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, పట్టుదల, మంచి విలువలను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి బాలల దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ముగించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కళావతి, ఉపాధ్యాయులు ఉమ, కుసుమాంజలి, స్పందన, స్వప్న, శృతి, పావని, సంతోష, అంజలి, కె. లావణ్య, రమ్య, నంధ్యారాణి, శిల్పి, కీర్తన, దీపన, లావణ్య, వైశ్వర్య, దుర్గమహేశ్వరి తదితరులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల సేవలో అన్నదానం.. 39వ రోజు 640 మందికి అన్నప్రసాద వితరణ.....

అనంతగిరి, నవంబర్ 14 (ప్రజాజ్యోతి)

తెలంగాణ శబరిమలగా పేరొందిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతోంది. శనివారం నాటికి ఈ కార్యక్రమం 39వ రోజుకు చేరుకోగా, సుమారు 640 మందికి పైగా అయ్యప్ప స్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు ప్రతిరోజూ అన్నప్రసాదం అందిస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులకు భోజన సదుపాయం కల్పించేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందిస్తున్నారు. 39వ రోజు అన్నప్రసాద వితరణకు మహారాజపోషకులతో పాటు ఖమ్మం వాస్తవ్యులు ఓరుగంటి పరమేశ్వర్ -- జ్యోతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదం అందించడం పట్ల ఆలయ నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పందిరి వీరయ్య, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి సత్యనారాయణ, కనకయ్య, జెర్రిపోతుల రాము, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. పలువురు అయ్యప్ప భక్తులు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.



రైతుల సంక్షేమమే లక్ష్యం.. వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం

- పిఎసిఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్

హుజూర్ నగర్, నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

అంతర్జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా హుజూర్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అవసరమైన రైతులు సహకార సంఘం ద్వారా పొందవచ్చని వెల్లడించారు. అలాగే సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమైనందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు.సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు కంచర్ల మధుసూదన్ రెడ్డి, ఇందిరాల లక్ష్మి, దేవరం మల్లేశ్వరి, జక్కుల మల్లమ్మ, కటారి శ్రీనివాస్, కందుల పద్మ, గోసుల శ్రీను, దుగ్గి బ్రహ్మం, మీసాల శ్యాంసుందర్, భూక్యా లచ్చిరాం నాయక్, రాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో రైతులు, సహకార సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో అప్రమత్తమైన ఇరిగేషన్ శాఖ..

రైతులకు అవగాహన....



అనంతగిరి, నవంబర్ 14 (ప్రజాజ్యోతి):

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. చెరువులు, బావుల ఆధారంగా సాగు చేస్తున్న రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.అనంతగిరి మండల పరిధిలోని వాయిలసింగవరం, చనుపల్లి, పాలవరం, కిష్టాపురం, అమీనాబాద్, త్రిపురవరం, పాలవరం తండా గ్రామాల్లో ఇరిగేషన్ శాఖ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.

నీటి వినియోగంపై ప్రత్యేక సూచనలు

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడితే చెరువుల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని అధికారులు రైతులకు వివరిస్తున్నారు. చెరువుల కింద సాగు చేసే రైతులు అందుబాటులో ఉన్న నీటిని పంట అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని



సూచిస్తున్నారు. బావుల ఆధారంగా సాగు చేసే రైతులు భూగర్భ జలాల లభ్యతను అంచనా వేసుకుని పంట కాలమంతా నీరు సరిపోయేలా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని చెబుతున్నారు.

ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత

నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో అధిక నీటి అవసరం ఉండే వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. వేరుశనగ, పెసర, మినుము, కంది, కుసుమ, పొద్దుతిరుగుడు, కూరగాయల సాగు వంటి ప్రత్యామ్నాయాలను రైతులకు వివరిస్తున్నారు. తక్కువ వ్యవధిలో పండే పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని తెలియజేస్తున్నారు.

రైతులకు ముందస్తు అవగాహన

మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులతో నేరుగా మాట్లాడి నీటి పొదుపు పద్ధతులు, పంటల ఎంపిక, సాగు ప్రణాళికపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పంటలు వేసే ముందు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ నీటిని పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా సాగులో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించుకోవచ్చని ఇరిగేషన్ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

- బాల్య వివాహాలు, వెట్టి చాకిరి నిర్మూలనకు ప్రతిజ్ఞ

- ఉపసర్పంచ్ షేక్ హైమద్ బాబా

మోతె నవంబర్14(ప్రజా జ్యోతి)



బాలల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని రావిపహాడ్ ఉపసర్పంచ్ షేక్ హైమద్ బాబా కోరారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మాట్లాడుతూ బాల్యం అమూల్యమైనదని, పిల్లలకు పౌష్టికాహారం, స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు, వెట్టి చాకిరి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ప్రాథమిక పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జ్యోతి మాట్లాడుతూ.... విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని కష్టపడి చదవాలని సూచించారు. అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకొని కలలను సాకారం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు నాయకపు పరమేష్ పాఠశాలకు మూడు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు.విద్యార్థులు జాతీయ నాయకులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు, కలెక్టర్లు, న్యాయవాదులు, న్యాయమూర్తుల వేషధారణలో ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాయకపు పరమేష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమృతరెడ్డి, ఉపాధ్యాయులు పాపిరెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజు, రంగయ్య, రాజేశ్వరి, రమ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఉచిత నేత్ర వైద్య సేవలు

- సర్వారంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

- కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి..

బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఏలూరు వెంకటేశ్వరరావు

మోతె నవంబర్14(ప్రజా జ్యోతి)

గ్రామీణ ప్రాంత ప్రజలకు నేత్ర వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో సూర్యాపేట జిల్లా మోతె మండలం సర్వారం గ్రామంలో అరుణ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శనివారం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఏలూరు వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో అమూల్యమైనదని, చూపు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నేత్ర పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూడు నగేష్, ఉపసర్పంచ్ పల్స మల్సూర్, గ్రామ పెద్దలు మిక్కిలినేని పురుషోత్తమరావు, వైద్యులు బాషా నాయక్, చామంతి, వార్డు సభ్యుడు వద్దే మల్సూర్, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం..

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆగ్రహం... అనంతగిరి మండల

బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి...



అనంతగిరి, నవంబర్ 14 (ప్రజాజ్యోతి)

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ అనంతగిరి మండల పార్టీ అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ పథకాల అమలులో రాజకీయాలకు తావివ్వకుండా నిజమైన అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శనివారం అనంతగిరి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం పేదలకు న్యాయం చేయడంలో విఫలమవుతోందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు చేయూత పింఛన్లు సహా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులోనూ అర్హులైన పేదలకు ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద రైతులు, నిరుపేద కుటుంబాలు, ఆడబిడ్డలకు తగిన ప్రయోజనాలు అందడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పథకాల ఎంపికలో పారదర్శకత పాటించకుండా, రాజకీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా అనర్హులకు లబ్ధి చేకూరుస్తున్నారని ఆయన ఆరోపించారు. నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయకుండా అన్యాయం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ ఇళ్లతో పాటు అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం జరగకపోతే వారి పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని నల్ల భూపాల్ రెడ్డి తెలిపారు.

బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

మున్సిపల్ మాజీ క్రిస్టియన్ కోఆప్షన్ సభ్యురాలు వంటేపాకజానకి యేసయ్య

కోదాడ టౌన్, నవంబర్ 14(ప్రజా జ్యోతి):

కోదాడ నయానగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో క్రిస్టియన్ కోఆప్షన్ మాజీ సభ్యురాలు వంటేపాక జానకి యేసయ్య ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని నవంబర్ 14న నిర్వహించిన ఈ వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ తొలి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రాధాన్యతను, వారి భవిష్యత్తు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కోర్ కమిటీ చైర్మన్, వి యేసయ్య, అనంతగిరి పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షులు ఈ. రాజేష్, కోదాడ పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ల ప్రభుదాస్, కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు

ఆలేరు నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని చందపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ నాగేష్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌలుడని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి మరియు విద్యార్థుల సంక్షేమానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశిధర్ రెడ్డి జిపిఓ మహేష్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు

ఆలేరు నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్ల గూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎస్ రెడ్డి మహేందర్రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభను శనివారం నిర్వహించి ఈ సందర్భంగా నేటి బాలలే రేపటి పౌరులని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల సంక్షేమానికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ శ్రావణ్ కుమార్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరళ సృజన, ఏపీవో అరుణకుమారి మాజీ సర్పంచ్ వార్డు సభ్యులు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు సమాజం, ప్రభుత్వం సమష్టిగా కృషి చేయాలి... అలుగుబెల్లి

- ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి
- టీఎస్ యుటిఎఫ్ నేతలు





హుజూర్ నగర్ నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ప్రభుత్వం, ఉపాధ్యాయులు, సమాజం సమష్టిగా కృషి చేయాలని మాజీ శాసనమండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని టౌన్‌హాల్‌లో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఆరవ మహాసభలు జిల్లా అధ్యక్షుడు ఎన్. సోమయ్య అధ్యక్షతన ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ నుంచి టౌన్‌హాల్ వరకు ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పట్టణ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలని కోరారు.టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఆన్‌లైన్ సమాచారం, గూగుల్ షీట్లు వంటి బోధనేతర పనులతో ఉపాధ్యాయుల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యాబోధనపై ప్రభావం పడి విద్యార్థుల నాణ్యత దెబ్బతింటోందన్నారు.టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ రాములు మాట్లాడుతూ రెండో పీఆర్సీ కమిషన్ నివేదికను వెంటనే ప్రకటించి, జూలై 2023 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం నిర్వహించిన విద్యా సదస్సులో ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్ 'జాతీయ విద్యా విధానం–2020: గత ఆరేళ్ల అమలు పరిణామాలు' అనే అంశంపై ప్రసంగించారు. చైతన్య సదస్సులో డాక్టర్ అందె సత్యం 'అమెరికా యుద్ధోన్మాదం–ప్రపంచ సంక్షోభం' అనే అంశంపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డీలర్ అసోసియేట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ కు సన్మానం

ఆలేరు నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతపురి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ మాజీ జాతీయ నాయకులు కందుల శంకర్ మాదిగ ఇటీవల తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా ఎంఆర్పీఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి నల్ల చంద్ర స్వామి, జాతీయ నాయకులు మంద శంకర్, మండల అధ్యక్షులు కందుల నర్సింగరావు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



నేరేడులో ఘనంగా బాలల దినోత్సవం

చిట్యాల నవంబర్ 14 (ప్రజా జ్యోతి):

చిట్యాల మండలం నేరేడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వల్లం నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిర్యాల వెంకటేశం పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు ఎల్‌నినో పరిస్థితుల గురించి వివరిస్తూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, చెట్లను పెంచడం ద్వారా వర్షాలు పడే అవకాశం మెరుగుపరుచుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు విభిన్న వేషధారణలతో, ఆటపాటలతో తమదైన రోజును ఉత్సాహ భరితంగా, ఆనందోత్సవాలతో జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చ సరిత, ఉపాధ్యాయులు పి హేమలత, రంగ రామలింగయ్య, పోషం లింగస్వామి, వాలంటరీ సుమలత, ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ లావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





రేపు నల్లగొండలో చరిత్రాత్మక రైతు బహిరంగ సభ

- యాదాద్రి భువనగిరి జిల్లా నుండి 10 వేల మంది హాజరు

- రాజకీయాలకు అతీతంగా రైతులు స్వచ్ఛందంగా తరలిరావాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యం.డి. జహంగీర్

ఆలేరు, నవంబర్ 14: (ప్రజా జ్యోతి)

నవంబర్ 15న నల్లగొండలో లక్ష మంది రైతులతో నిర్వహించనున్న చరిత్రాత్మక రైతు బహిరంగ సభకు యాదాద్రి భువనగిరి జిల్లా నుండి 10 వేల మంది హాజరుకానున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యం.డి. జహంగీర్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా రైతులందరూ స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.శుక్రవారం ఆలేరు మండల కేంద్రంలో సీపీఐ(ఎం) మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశంతో కలిసి యం.డి. జహంగీర్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రైతులకు అనేక హామీలు ఇచ్చిందని, పంటల ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతం కలిపి కనీస మద్దతు ధర కల్పిస్తామని ప్రకటించినప్పటికీ ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన హామీ కూడా నెరవేరలేదన్నారు.దేశంలో వ్యవసాయ రంగం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని, పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతాంగ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ రంగాన్ని అప్పగించే విధానాలను వ్యతిరేకించాలని, రైతుల భూములను రక్షించాలని, రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ రంగాన్ని, రైతాంగ హక్కులను కాపాడేందుకు రైతు సంఘాలు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.



1936లో ఆవిర్భవించిన అఖిల భారత రైతు సంఘం (ూ×ఖూ) దేశవ్యాప్తంగా రైతాంగ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిందని, ప్రస్తుతం 27 రాష్ట్రాల్లోని 700 జిల్లాల్లో రైతులను సమీకరిస్తూ రైతాంగ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు జరగనున్న 36వ అఖిల భారత రైతు సంఘం మహాసభలు దేశ రైతాంగ ఉద్యమానికి కీలకమైనవని పేర్కొన్నారు.రైతుల ఐక్యత, హక్కులు, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి 10 వేల మందిని సమీకరించి బహిరంగ సభలో పాల్గొనేలా పార్టీ, రైతు సంఘం నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలపై జరిగే ఈ సభలో రాజకీయాలకు అతీతంగా రైతులందరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ ఇక్బాల్ మండల కార్యదర్శి ధూపటి వెంకటేష్ ,మండల కమిటీ సభ్యులు సూదగాని సత్య రాజయ్య తులసయ్య పిక్క గణేష్, లక్ష్మీనారాయణ శంకరయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఘనంగా స్పోర్ట్ ఐకాన్

- 2కె 26 క్రీడా సంబరాలు ప్రారంభం



మిర్యాలగూడ, నవంబర్ 14,(ప్రజాజ్యోతి):

మిర్యాలగూడ పట్టణం లోని కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ స్కూల్ లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్పోర్ట్ ఐకాన్ -2కె 26 క్రీడలు చైర్మన్ ఏస్.జగన్ అధ్యక్షతన ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిర్యాలగూడ మండల విద్యాధికారి ధర్మానాయక్, మేనేజింగ్ డైరెక్టర్ జైపాల్ లు హాజరై స్పోర్ట్స్ ఫ్లాగ్ ఆవిష్కరించారు.కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ స్కూల్ లో గత 4 సంవత్సరాలుగా స్పోర్ట్స్ ఐకాన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని,ఈ సంవత్సరం కూడా ఆ ఆనవాయితిని కొనసాగిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు వివిధ రకాల క్రీడల్లో పాల్గొన్నారు.14, 16 తేదీల్లో జరుగుతున్న స్పోర్ట్స్ ఫెస్టివల్ లో స్కూల్ ప్యూపిల్ లీడర్, డిప్యూటీ స్కూల్ ప్యూపిల్ లీడర్, స్పోర్ట్స్ సెక్రటరీ, డిసిప్లిన్ సెక్రటరీ, కల్చరల్ సెక్రటరీ, లిటరరీ సెక్రటరీ, హౌస్ క్యాప్టెన్స్, హౌస్ వైస్ క్యాప్టెన్స్, హౌస్ మాస్టర్స్ మార్చ్ ఫాస్ట్ లో పాల్గొన్నారు.జీవితంలో తిరిగి రానిది బాల్యం, బాల్యంలో ఉన్న నిజమైన ఆనందాన్ని చెదరని జ్ఞాపకంగా మిగిలిపోవాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం తెలిపారు. విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.చదువుతో సమానంగా క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తూ, జీవితంలో గెలుపు ఓటములు సహజమని, వీటిని సమానంగా తీసుకోవడం అనేదే మా విద్యార్థులకు చిన్నతనం నుండే నేర్పించడం మా ప్రధాన లక్ష్యం మని



అన్నారు. ఎం ఇ ఓ డి. ధర్మానాయక్ మాట్లాడుతూ ఇంత పెద్ద పాఠశాల మైదానంలో విద్యార్థులు ఆటలు ఆడుతూ ఆనందంగా ఉన్నారని అన్నారు. పాఠశాల మైదానమును, పాఠశాల వాతావరణమును చూసి చాలా మెచ్చుకున్నారు. స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ జైపాల్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు కంటే క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మొహమ్మద్ అవేజ్ బాబా, ప్రిన్సిపాల్, ఏ .ఓ . ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవ సందర్భంగా టీవీ బహుకరణ

ఆలేరు నవంబర్ 14 (ప్రజా జ్యోతి)





యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని మబ్బు అబ్బాస్ చైర్మన్ మబ్బు మహేష్ ఫౌండేషన్ తరపున పాఠశాల విద్యార్థులకు టీవీని బహుకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలుడే దేశ భవిష్యత్ వారి అభివృద్ధి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్, ఉపసర్పంచ్ వంగాల నికిత మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, బొట్ల నాగులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ఎంపిఎల్ వైస్ ప్రెసిడెంట్ పుట్టినరోజు వేడుకలు

చిట్యాల నవంబర్ 14 ప్రజా జ్యోతి :



ఎంపిఎల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అజయ్ కుమార్ పుట్టినరోజును పురస్కరించుకొని అనాథాశ్రమంలో సేవా కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. పుట్టిన రోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా వృద్ధుల మధ్య గడుపుతూ వారికి పండ్లు, అల్పాహారం అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పి ఎల్ కంపెనీ జీఎం కుర్మారావు, ఎం పి ఎల్ అడ్మిన్ జోగారావు, మేడి శ్రీను, సాగర్ల నరేష్, దామునూరు కృష్ణ, బూరుగు వీరస్వామి, మచ్చ రాజు తదితరులు పాల్గొన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే గొప్ప సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలిచింది.

బాలల దినోత్సవం సందర్భంగా గ్రీన్ వుడ్ పాఠశాల

విద్యార్థుల సేవా కార్యక్రమాలు







హుజూర్ నగర్ నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఏరియా ఆసుపత్రి, సబ్ జైలును సందర్శించి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హుజూర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులకు విద్యార్థులు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సబ్‌జైలులోని ఖైదీలకు సైతం పండ్లు, బ్రెడ్ అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాల ద్వారా సమాజం పెట్ల బాధ్యతను విద్యార్థుల్లో పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, గ్రీన్‌వుడ్ పాఠశాల చైర్మన్ తుమ్మ సరిత మర్రెడ్డి, ప్రిన్సిపాల్ రాజారెడ్డి అకడమిక్ కోఆర్డినేటర్ భూపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా బాలల దినోత్సవ గ్రామసభ

ఆలేరు నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం షరాజీపేట గ్రామంలో ఘనంగా బాలల దినోత్సవం వేడుకలను గ్రామ సర్పంచ్ కంతి మధు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని చాచా జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజును పురస్కరించుకొని బాలుడు దినోత్సవాన్ని జరుపుకుంటున్నమన్నారు. పిల్లలే దేశ భవిష్యత్ అని తెలిపారు విద్యార్థులకు మంచి సూచనలు సలహాలు ఇస్తూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈసారి జరగబోయే పదవ తరగతి పరీక్షలో మన పాఠశాల మండల స్థాయిలో ప్రథమ స్థానంలో రావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయుల బృందం అంగన్వాడీ టీచర్లు.

జయ పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 14(ప్రజా జ్యోతి):

భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జయ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ జాతీయ నాయకులు,దేవతామూర్తుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ,భరతమాత,తెలంగాణ తల్లి రూపాల్లో చిన్నారులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను,ఉపాధ్యాయులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయ శేణుగోపాల్,డైరెక్టర్లు జెల్లా పద్మ,బింగి జ్యోతి పాల్గొని విద్యార్థులను అభినందించారు. వేడుకల విజయవంతానికి సహకరించిన తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.





బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

నార్కట్ పల్లి, నవంబర్ 14 (ప్రజా జ్యోతి):

నార్కట్ పల్లి మండలం చెరువుగట్టు ప్రాథమిక పాఠశాలలో భారత తొలి ప్రధానమంత్రి, బాలల ప్రియతమ నాయకుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పాఠశాలలోని 84 మంది విద్యార్థులకు రూ. 30 వేల రూపాయల విలువైన ఒక జత స్కూల్ యూనిఫాములను చెరువుగట్టు దేవస్థానం చైర్మన్ వారాల రమేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ రేగట్టే రాజశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఆమనగంటి జలంధర్ రెడ్డి, వార్డు సభ్యులు ఖమ్మం పాటి వెంకటయ్య, రేగట్టె ప్రియాంక నరేష్ రెడ్డి, కూకుట్ల శ్రీకాంత్, ఒంటెపాక శిరీష, శివ, పిట్టల నాగన్న, మాజీ వార్డ్ మెంబర్ గంట శేఖర్, కొమ్ము మహేష్, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శి నన్నూరి రవీందర్ రెడ్డి, ఆశ వర్కర్స్ చీర పద్మ, చేపూరు మొగులమ్మ పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను ప్రస్తావించినందుకే ముందస్తు అరెస్టు చేస్తారా

ఆలేరు నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించాడానీ జిల్లా సర్పంచుల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని యాదాద్రి భువనగిరి జేఏసీ జిల్లా అధ్యక్షుడు జూకంటి అనిల్ తెలిపారు. శనివారం సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లాలని భావించారాని తెలిపారు. నిధులు రాక గ్రామ పంచాయతీ వ్యవస్త కుంటు పడుతుందన్నారు. రాష్ట్రంలో మాజీ సర్పంచులు గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ జీవితకాలం కష్టపడి దాచుకున్న డబ్బులు, రావాల్సిన బకాయిలు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చిన్న కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు మంజూరు కాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. మరోవైపు నిరుద్యోగ యువతకు సరైన ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఆందోళనలో ఉన్నారని, అశోక్ నగర్‌లోని నిరుద్యోగుల వద్దకు వెళ్లి వారి సమస్యలను స్వయంగా తెలుసుకోవాలని రాహుల్ గాంధీని కోరానని తెలిపారు. అలాగే రైతులు విద్యుత్ సరఫరా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ తెలంగాణలోని ఏదైనా ఒక



గ్రామానికి వెళ్లి గ్రామీణ ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, మాజీ సర్పంచులు, రైతులు, నిరుద్యోగులు, పెన్షనర్లు, చిన్న కాంట్రాక్టర్లను కలిసి వారి బాధలను వినాలని కోరినట్లు యాదయ్య గౌడ్ వెల్లడించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించడం తప్పా? ప్రజల కష్టాలను జాతీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లడం నేరమా? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. ప్రజల గొంతుకగా నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగిస్తామాని ఆయన స్పష్టం చేశారు.

దార్శనికుడు, స్ఫూర్తి ప్రధాత భారతరత్న పండిట్ నెహ్రూ

- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

మిర్యాలగూడ, నవంబర్ 14,(ప్రజాజ్యోతి):

స్వతంత్ర భారత తొలి ప్రధాని, భారతరత్న పండిట్ జవహర్లాల్ నెహ్రూ దార్శనికుడు, స్ఫూర్తి ప్రధాత అని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్)అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో పాల్గొని విజయం సాధించి, స్వతంత్ర భారతావనికి తొలి ప్రధానిగా ఎన్నో గొప్ప సంస్కరణలు చేసిన స్ఫూర్తి ప్రదాత భారతరత్న నెహ్రూ అని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





విధి కుక్కల స్థైర విహారం

ఆలేరు నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో పాటు పలు గ్రామాలలో వీధి కుక్కల బెడద తీవ్రస్థాయికి చేరుకుంది. మండలంలోని ఏ గ్రామాలలో చూసిన కుక్కల గుంపులే దర్శనమిస్తున్నాయి. ఒక గ్రామం నుండి వేరే గ్రామానికి వెళ్లాలంటే వాహనం ద్వారా వెళ్లవలసి వస్తే వాహనం వెంబడిస్తున్నాయి శునకాలు. పిల్లలు మహిళలు వృద్ధులు బయట తిరగాలంటే వనికి పోతున్నారు. మండల కేంద్రమైన మోట కొండూరు గ్రామంలోనే గడచిన రెండు నెలలు అత్యధికంగా 14 కుక్క కాటు కేసులు నమోదు కావడం ఆశ్చర్యంగా మారింది. మండలంతో పాటు పలు గ్రామాలలో చూస్తే గడిచిన రెండు నెలల్లో సుమారు 35 కేసులు నమోదయ్యాయి. ఆసుపత్రికి వెళ్ళని లెక్కలోకి రాని కేసులు ఎన్నో ఉన్నాయి. ఇటీవల శుక్రవారం మండలంలోని మాటూరు గ్రామంలో మేఘన అనే చిన్నారిపై వీధి కుక్కలు విచక్షణ రైతంగా దాడి చేశాయి. వీపునిండా గాయాలు చేయడంతో చిన్నారి భయంతో వణికిపోయింది. స్థానికులు గమనించి చిన్నారిని కాపాడారు. మండల వ్యాప్తంగా కుక్కల సంఖ్య పెరిగిపోతున్న స్టరీలైజేషన్ , వ్యాక్సిలేషన్ కార్యక్రమాలు జరగకపోవడం పై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మండల వ్యాప్తంగా డ్రైవ్ నిర్వహించి వీధి కుక్కలను నివారించాలని



ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామాల ప్రజలు కోరు.

వాహనంపై వెళ్లాలంటే భయంగా ఉంది

కర్రె ప్రవీణ్, మోట కొండూరు

గల్లీల లో వాహనంపై వెళ్లాలంటే భయంగా ఉంది. సుమారు 40 స్పీడ్ ఉంటే శునకాలు వెంబడిస్తున్నాయి. వాహనం స్లో చేయాలంటే భయంగా ఉంది కుక్కలు కలవడానికి వస్తున్నాయి. ఒక గల్లికి సుమారు 50 నుండి 100 కుక్కలు ఉన్నాయి. కుక్కల సమస్య మండలంలో ఎక్కువగా ఉంది వెంటనే పరిష్కరించాలి.



వివేకానంద హైస్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 14(ప్రజా జ్యోతి):



సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో గల వివేకానంద హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలతో సందడి చేశారు.దేవతామూర్తులు,ఉపాధ్యాయులు, వైద్యులు,ఇంజినీర్లు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, పోలీసు అధికారులు, యోధులు, భారతమాత తదితర వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు.భవిష్యత్తులో తాము ఎంచుకునే వృత్తులు,లక్ష్యాలను ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గుడిమెట్ల సంతోష్ శర్మ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని,దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని అన్నారు.పిల్లలంటే అమితమైన ఇష్టమున్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినమైన నవంబర్ 14ను ప్రతి సంవత్సరం బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.పాఠశాల ప్రిన్సిపాల్ గుడిమెట్ల స్వప్న మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకత,నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

విద్యార్థులు బాగున్నప్పుడే దేశం బాగుంటుంది

ఆలేరు నవంబర్ 14(ప్రజా జ్యోతి)

విద్యార్థులు బాగున్నప్పుడే దేశం బాగుంటుందని రిటైర్డ్ టీచర్ నీరు మినరల్ వాటర్ అధినేత పుష్పమాల గణేష్ అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థులకు వారి కూతురు రజిత పంపించిన స్టీల్ వాటర్ బాటిల్ లను డొనేట్ చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ మనకు లభించిన విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కష్టపడి చదువుకొని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యా కేవలం పుస్తకాలకే పరిమితం కాకూడదని అది మీలో ఆలోచన శక్తిని సృజనాత్మకతను నైతిక విలువలను పెంచాలని చదువుతోపాటు క్రీడలు కలలు మరియు ఆధునిక సాంకేతికతను నేర్చుకున్నప్పుడే పరిపూర్ణమైన వ్యక్తులుగా ఎదుగుతామని దానికోసం విద్యార్థులు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి, ఎన్సిసి అధికారి దూడల వెంకటేష్, ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి సైదులు పరమేష్ సైదులు నరేంద్ర స్వామి శంకర్ రెడ్డి మేఘరాజు ప్రసూన స్వర్ణలత శోభారాణి రాధిక కవిత శ్రీధర్ సురేష్ జోష్మ తదితరులు పాల్గొన్నారు.







సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఆలేరు నవంబర్ 14(ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని పటేల్ గూడెం గ్రామానికి చెందిన బండ జాంగిర్ ఇటీవల యాక్సిడెంట్ కావడంతో వారి ఆస్పత్రుల ఖర్చులకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమారస్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు జాంగిర్, వార్డు సభ్యులు నల్ల సంపత్, బండ రమేష్, మామిడాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం

– వేషధారణలతో అలరించిన చిన్నారులు

చౌటుప్పల్, నవంబర్ 14 (ప్రజా జ్యోతి) :



చౌటుప్పల్ లోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహంగా సాగాయి. ఈ వేడుకల్లో విద్యార్థులు డాక్టర్లు, కలెక్టర్లు, పోలీసులు, సైనికులు, రైతుల వేషధారణలతో అందరి దృష్టిని ఆకర్షించారు. వివిధ వృత్తుల ప్రాముఖ్యతను వివరిస్తూ చిన్నారులు చేసిన ప్రసంగాలు అకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం డైరెక్టర్ సాదిపల్లి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

– బాలల గ్రామసభలో విద్యార్థుల విజ్ఞప్తి

చింతలపాలెం, నవంబర్ 14 (ప్రజా జ్యోతి) :



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపడాలని, విద్యార్థుల భవిష్యత్తుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని బాలలు కోరారు. బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామ పంచాయతీ కార్యాలయలలో శనివారం నిర్వహించిన బాలల గ్రామసభలో విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు లభిస్తున్న గుర్తింపు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దక్కడం లేదని పేర్కొన్నారు. బోధనా ప్రమాణాలు మెరుగుపడితే ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో జరిగిన బాలల గ్రామ సభ అనంతరం సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 18 ఏళ్లలోపు వారంతా బాలలేనని, బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని, బాల కార్మికులతో పనులు చేయించడం చట్టవిరుద్ధమని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సైదులు, ఆయా గ్రామాల్లో గ్రామ సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ టెల్ టవర్ల దొంగతనాల్లో ఇంజినీర్ల ముఠా అరెస్ట్..

- పనిచేస్తున్న సంస్థకే కన్నం.. ఇంజనీర్లతో సహా తొమ్మిది మంది అరెస్టు..

- ఖరీదైన రేడియో రిమోట్ యూనిట్లే టార్గెట్..- రాత్రివేళల్లో టవర్లపై కన్ను పరికరాల మాయం..

- తెలుగు రాష్ట్రాల్లో 38 చోరీలు.. రూ.1.62 కోట్ల విలువైన పరికరాలు అపహరణ..

- రూ.25 లక్షల విలువైన మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.15 లక్షల నగదు స్వాధీనం..

- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్







నల్గొండ, నవంబర్ 14 (ప్రజాజ్యోతి):

మొబైల్ టవర్లలో ఏర్పాటు చేసిన ఖరీదైన రేడియో రిమోట్ యూనిట్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందితో కూడిన తొమ్మిది మంది ముఠాను నల్గొండ జిల్లా నేర పరిశోధన విభాగం పోలీసులు పట్టుకున్నారు. పనిచేస్తున్న సంస్థకే కన్నం వేసిన ఈ ముఠా తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 38 చోరీలకు పాల్పడి సుమారు రూ.1.62 కోట్ల విలువైన పరికరాలను అపహరించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.జిల్లాలోని త్రిపురారం, నల్గొండ గ్రామీణ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన టవర్ పరికరాల చోరీలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి, నేర పరిశోధన విభాగం ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ఈ చోరీలకు పాల్పడుతున్నది బయట వ్యక్తులు కాదని, సంబంధిత సంస్థలో పనిచేస్తున్న ముగ్గురు ఇంజినీర్లు, నలుగురు సాంకేతిక సిబ్బంది, ఒక వాహన చోదకుడు, గతంలో అదే సంస్థలో పనిచేసిన మరో ఉద్యోగి అని గుర్తించారు.ఈ నెల 14న నల్గొండ గ్రామీణ, త్రిపురారం పోలీసుల వాహన తనిఖీల సందర్భంగా రెండు ప్రాంతాల్లో ఐదుగురు, నలుగురు చొప్పున మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల గుట్టు బయటపడింది. రాత్రి వేళల్లో తమకు తెలిసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మొబైల్ టవర్ల వద్దకు చేరుకుని, వైర్లు కత్తిరించి ఖరీదైన పరికరాలను అపహరించేవారు. వాటిని హైదరాబాద్‌లో విక్రయించి వచ్చిన డబ్బుతో కార్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేయడంతో పాటు విలాసాలకు ఖర్చు చేసేవారని విచారణలో వెల్లడైంది. విచారణలో నల్గొండ జిల్లాలో 9, మిర్యాలగూడలో 16, దేవరకొండలో 2, సూర్యాపేటలో 8, ఇతర జిల్లాల్లో 3 చొప్పున మొత్తం 38 చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. నిందితుల నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.15 లక్షల నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన త్రిపురారం ఎస్ఐ కె.నరేశ్, నల్గొండ గ్రామీణ ఎస్ఐ, నేర పరిశోధన విభాగం ఎస్ఐ సురేశ్, హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్‌గిరి, పుష్పగిరి, ఫయాజ్, నాగరాజు, కానిస్టేబుళ్లు అస్రార్, సాయి, శివరాజు, నరేశ్‌లను ఎస్పీ అభినందించి వారికి రివార్డు ప్రకటించారు.

గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం

వేషధారణలతో అలరించిన చిన్నారులు

చౌటుప్పల్, నవంబర్ 14 (ప్రజా జ్యోతి) :

చౌటుప్పల్ లోని గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహంగా సాగాయి. ఈ వేడుకల్లో విద్యార్థులు డాక్టర్లు, కలెక్టర్లు, పోలీసులు, సైనికులు, రైతుల వేషధారణలతో అందరి దృష్టిని ఆకర్షించారు. వివిధ వృత్తుల ప్రాముఖ్యతను వివరిస్తూ చిన్నారులు చేసిన ప్రసంగాలు అకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించు కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం డైరెక్టర్ సాదిపల్లి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాకింగ్ ట్రాక్‌కు కొత్త కళ.. ప్రత్యేక పారిశుద్ధ్య పనులు!

- ఎడమ కాలువ కట్టపై పరిసరాల పరిశుభ్రతకు మున్సిపాలిటీ చర్యలు

హాలియా,నవంబర్ 14 (ప్రజా జ్యోతి):

హాలియా పట్టణంలోని ఎడమ కాలువ కట్టపై ఉన్న వాకింగ్ ట్రాక్ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు.మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి సూచనల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.వాకింగ్ ట్రాక్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. దీంతో వాకింగ్ ట్రాక్ పరిసరాలు పరిశుభ్రంగా మారాయి.ఈ సందర్భంగా చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు వాకింగ్ కోసం వినియోగించే ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు.ప్రజలు సైతం చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా,తమ పరిసరాల పరిశుభ్రతకు బాధ్యతగా సహకరించాలని కోరారు.



భారత్ సమ్మిట్--2026 ముగింపు సమావేశంలో ఎమ్మెల్యే బాలు నాయక్

రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే

దేవరకొండ, నవంబర్ 14, (ప్రజా జ్యోతి) :



హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ , నోవాటెల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన భారత్ సమ్మిట్--2026 ముగింపు సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ప్రపంచ దేశాల మధ్య ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం, శాంతి, సుస్థిర అభివృద్ధిని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. సుమారు 70 దేశాలకు చెందిన రాజకీయ ప్రముఖులు, విధాన నిర్ణేతలు, మేధావులు, వివిధ రంగాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక, ఆర్థిక న్యాయం, వాతావరణ మార్పులు, మహిళా సాధికారత, యువత భవిష్యత్తు, కృత్రిమ మేధస్సు (ఏఐ), అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ముగింపు సమావేశంలో రాహుల్ గాంధీ భారతదేశ భవిష్యత్తు, ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, సమానత్వం, శాంతియుత సహజీవనం వంటి కీలక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అంతర్జాతీయ స్థాయి సదస్సులకు వేదికగా నిలవడం, ప్రపంచ దేశాల ప్రతినిధులను హైదరాబాద్‌కు ఆహ్వానించి కీలక అంశాలపై చర్చలకు అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు

ఆలేరు నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం షర్బనాపురం గ్రామంలో బాలల దినోత్సవం వేడుకలను గ్రామ సర్పంచ్ మొగులగాని నరసయ్య శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి అంగన్వాడీ టీచర్ యాదలక్ష్మి వి బి కే కీర్తన పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

కోదాడ, నవంబర్ 14(ప్రజా జ్యోతి):

పట్టణ పరిధిలోని తమ్మర బండ పాలెం అంగనవాడి ఫస్ట్ సెంటర్ లో శనివారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ వస్త్రాధారణలో పిల్లలను వ్యవహరించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ ఎం వెంకటరమణ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని పిల్లలు ఎదగాలన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లులు, పిల్లలు, అంగన్వాడి ఆయా, తదితరులు పాల్గొన్నారు.



ఈనెల 17న, జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జి వి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటియా నాయక్

మిర్యాలగూడ, నవంబర్ 14,(ప్రజాజ్యోతి):



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన అభ్యర్థులకు పెండింగ్ లో ఉన్న ఇన్సెంటివ్ సబ్సిడీ విడుదల కోరుతూ ఈనెల 17న హైదరాబాదులో చేపట్టే ఐఓసీ ఆఫీస్ ముట్టడికి వేలాదిగా తరలిరావాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధీరావత్ కోటియా నాయక్ కోరారు. శనివారం స్థానికంగా ఎల్ హెచ్ పి ఎస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న సబ్సిడీ విడుదల చేసి గిరిజనులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఐఓసీ ఆఫీస్ ముట్టడికి పెద్ద ఎత్తున గిరిజనులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇస్లావత్ సైదా నాయక్, రవీందర్ నాయక్, రామారావు, రంగా నాయక్, సురేష్ నాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

59 మందికి నూతన పెన్షన్ మంజూరు

నాలుగు రకాల పెన్షన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేత

వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులకు ఆర్థిక భరోసా

కోదాడ రూరల్, నవంబర్ 14(ప్రజా జ్యోతి):

అర్హులైన నిరుపేదలకు సామాజిక భద్రత కల్పిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకాలు ఎంతోమంది జీవితాల్లో ఆర్థిక భరోసా నింపుతున్నాయని దోరకుంట గ్రామ సర్పంచి పాలకి సురేష్ అన్నారు. మండల పరిధిలోని దోరకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అర్హులైన మొత్తం 59 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పెన్షన్ మంజూరు పత్రాలను గ్రామ సర్పంచి , ఉపసర్పంచి , గ్రామ కార్యదర్శి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా నూతనంగా పెన్షన్ మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ సమాజంలోని నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులకు



ఆర్థిక భరోసా కల్పించడంలో సామాజిక భద్రతా పెన్షన్ ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి నెలా ప్రభుత్వం అందించే పెన్షన్ సొమ్ము లబ్ధిదారుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధాప్యం, అనారోగ్యం, కుటుంబ పరిస్థితుల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా గ్రామ పంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. గ్రామంలో నూతనంగా 59 మందికి పెన్షన్ మంజూరు కావడం సంతోషకరమైన విషయమని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడం ద్వారా వారి కుటుంబాలకు కొంతమేర ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు.తమకు నూతనంగా పెన్షన్ మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తమకు పెన్షన్ మంజూరు కావడానికి సహకరించిన గ్రామ సర్పంచి , ఉపసర్పంచి , గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ పాలకవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వార్డ్ మెంబర్స్ పాలడుగు జాను, వనపర్తి పిచ్చయ్య, కొమ్మగాని పాపయ్య, శీలం నాగమణి, పత్తిపాక వెంకటేశ్వర్లు, గద్దల వెంకటేశ్వర్లు, పత్తిపాక రామ్మూర్తి, నాగేంద్ర బాబు, సైదులు, ఆరిఫ్ గ్రామ పెద్దలు, నూతన పింఛన్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీలో జరిగిన రోడ్డు పనులు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరగడం లేదు

- ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు లింగాల ముత్తయ్య

నార్కట్ పల్లి, నవంబర్ 14(ప్రజా జ్యోతి):

నార్కట్ పల్లి పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనుల కారణంగా వాహనాల రాకపోకలు పెరిగి, భారీగా దుమ్ము లేస్తున్న డంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు లింగాల ముత్తయ్య పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.



ఆర్టీఐ సర్వీస్ సొసైటీ నూతన నియామకాలు

- జాతీయ అధ్యక్షుడు కె. బాబురామ్ నాయక్ చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత

- ప్రజా హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పాన్ ఇండియా స్థాయిలో సంస్థ విస్తరణ

దేవరకొండ, నవంబర్ 14, (ప్రజా జ్యోతి) :

ప్రజా హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ (ఆర్టీఐఎస్ఎస్) ఆధ్వర్యంలో నూతన సభ్యత్వ నమోదు, నియామక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షుడు కె. బాబురామ్ నాయక్ (ఎం.టెక్) ఐదుగురికి నూతన బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రాలను అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వ అధికారిక రిజిస్ట్రేషన్ నంబర్ 53/2026తో పాటు, కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ పరిధిలోని ఎన్జీఓ దర్పణ్ గుర్తింపు (ఐడీ: టిఎస్/2026/0976823) పొందిన ఈ సంస్థ పాన్ ఇండియా స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం, సమాచార హక్కు చట్టం--2005పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, అవినీతిని అరికట్టేందుకు చట్టబద్ధంగా పోరాటం చేయడం సంస్థ ప్రధాన లక్ష్యాలని జాతీయ అధ్యక్షుడు కె. బాబురామ్ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా

నూతనంగా నియమితులైన ప్రతినిధులు:

నారమోని హరీష్ -- తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు (తిమ్మాపురం, నల్గొండ జిల్లా).షేక్ జావీద్ -- దేవరకొండ మండల అధ్యక్షుడు (ఇద్దంపల్లి).పెద్దమోని ఆంజనేయులు -- డిండి మండల అధ్యక్షుడు (గోనబోయినపల్లి).వరికుప్పల ఆంజనేయులు -- నేరేడుగొమ్ము



మండల అధ్యక్షుడు.రమావత్ శ్రీను -- పెద్దవూర మండల అధ్యక్షుడు (నాయనవాని కుంట తండా).నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రతినిధులంతా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, బాధితుల సమస్యలను గుర్తించి, వారికి న్యాయం జరిగే వరకు అండగా నిలవాలని కె. బాబురామ్ నాయక్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ శాఖల్లో ఎక్కడైనా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నా రాజ్యాంగబద్ధంగా, చట్టపరిధిలో పోరాడేందుకు సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా నిస్వార్థ సేవాభావంతో పనిచేస్తూ ప్రజా హక్కుల పరిరక్షణలో నూతనంగా నియమితులైన ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు.

ఘనంగా,ప్రారంభం అయిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- ముఖ్య అతిథిగా హాజరైన గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ

భువనగిరి,నవంబర్ 14 (ప్రజాజ్యోతి)

యాదాద్రి భువనగిరి,జిల్లా కేంద్ర గ్రంథాలయ వారోత్సవాలను జాతీయ పతాక ఆవిష్కరణ తో ఘనంగా ప్రారంభించిన చైర్మన్ అవేస్ చిస్తీ,





అనంతరం జరిగిన వారోత్సవాల ప్రారంభ సమావేశానికి సంస్థ చైర్మన్ అధ్యక్షత వహించి. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి,సరస్వతీ దేవి చిత్రపటానికి మరియు గ్రంథాలయ,పితామహులు. రంగనాథన్ చిత్రపటానికి పూలమా ల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంధా లయాలు,విద్యార్థులకు ఎంతో దోహదపడుతాయని గ్రంథాలయం లొ ఉండే పుస్తకాలు చదివి కాంపిటిటివ్ పరీక్షలో ఉత్తిర్ణత సాధించి ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిర పడ్డారని అన్నారు.అదే విధంగా గ్రంథాలయం లొ ఆన్ డిమాండ్ ప్రకారం రీడర్స్ కు అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఇంకా ఏవైనా పుస్తకాలు కాని ఇతరత్ర అవసరాలు ఉన్న సంస్థ చైర్మన్ గా నేరుగా నన్ను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమం లొ విద్యార్థులు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఉపాధ్యాయులుగా మారి బోధించిన బాలికలు..

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నడిగూడెం, నవంబర్ 14 (ప్రజాజ్యోతి):

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నడిగూడెం మండలంలోని స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయులు, పాఠశాల ఉన్నతాధికారుల పాత్రలను పోషిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి, డిప్యూటీ కార్యదర్శులు, జోనల్ ఆఫీసర్, డీసీఓ, ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయుల పాత్రల్లో బాలికలు చక్కగా విధులు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు.ఉపాధ్యాయులుగా వ్యవహ రించిన విద్యార్థినులు తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయ వృత్తిలో ఎదురయ్యే బాధ్యతలు, ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ప్రతి ఒక్కరూ వృత్తి విలువలను గౌరవిస్తూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థినులు నిర్వహించిన బోధనా తీరును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పరిశీలించి ప్రతిభ కనబరిచిన బాలికలను అభినందించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



బాలల హక్కుల పరిరక్షణకు నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయం

బాలలు లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : సర్పంచ్ దున్నా శ్రీనివాస్

నడిగూడెం, నవంబర్ 14 (ప్రజాజ్యోతి):

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి, భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అన్నారు. శనివారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నడిగూడెం మండల కేంద్రంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని, దానిని సాధించే దిశగా ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చేలా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం తదితర అంశాలపై బాలలకు అవగాహన కల్పించారు. బాలసభలో విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎలక ఉమారాణి, పల్లె దవాఖాన వైద్యుడు డాక్టర్ హరినాథ్, వార్డెన్ లతీమూన్, వార్డు సభ్యులు కాసాని మాధవి, గోపీనాథ్, షేక్ నాజియా రియాజ్, అంగన్‌వాడీ టీచర్లు సవిత, కొండలమ్మ, శకుంతల, స్వర్ణకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, వీఓ లావణ్య, ఆశా కార్యకర్తలు సునీత, శ్రీలక్ష్మి, జూనియర్, ఓం అసిస్టెంట్ వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మిట్ లొ పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం

భువనగిరి,నవంబర్ 14ప్రజాజ్యోతి

హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ (హెచ్ ఐ సీసీ)హైటెక్స్ వేదికగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక భారత్ సమ్మిట్ -- 2026 కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు..ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి,ఎనుముల రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, విధాన నిర్ణేతలు, మేధావులు, ప్రముఖులు పాల్గొన్న ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచ దేశాల మధ్య సహకారం వంటి కీలక అంశాలపై చర్చలు జరిగాయి.





కస్తూర్బాలో స్వపరిపాలన దినోత్సవం

చింతలపాలెం, నవంబర్ 14 (ప్రజాజ్యోతి):

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతలపాలెం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలల స్వపరిపాలన దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాత్రలను పోషిస్తూ వివిధ బాధ్యతలను చేపట్టారు. విద్యాబోధన, పాఠశాల నిర్వహణలో భాగస్వాములై తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థినుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన పాలనపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎస్ఓ ప్రసన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు..



ప్రతి ప్రభుత్వ బడి లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి మరో గ్రంథాలయ ఉద్యమకర్త కస్తూరి ప్రభాకర్

మిర్యాలగూడ,నవంబర్ 14, (ప్రజాజ్యోతి):

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని మరో గ్రంథాలయ ఉద్యమకర్త కస్తూరి ప్రభాకర్ కోరారు. శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడ్తున్న, ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయాలు కార్యక్రమంలో భాగంగా బంగారుగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాలను మిర్యాలగూడ గ్రంథాలయాధికారి కుమ్మరికుంట్ల సుధాకర్ తో కలిసి ఆయన పరిశీలించారు. గ్రంథాలయాల ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ బంగారుగడ్డ పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వీరనారాయణ, ఉపాధ్యాయులు ఫిరోజ్, రాంసింగ్, ఎల్లమ్మ, రజని, వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి :

ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి

నడిగూడెం, నవంబర్ 14, ప్రజాజ్యోతి:

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ తమలోని క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి అన్నారు. శనివారం గురుకుల పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ గదిని ఆమె ప్రారంభించి, విద్యార్థినుల మధ్య నిర్వహించిన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. టేబుల్ టెన్నిస్ క్రీడలో రాణించేందుకు పాఠశాలలో కల్పించిన సదుపాయాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడలకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉన్నందున ప్రతిరోజూ సాధన చేస్తూ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



రోజ్ బడ్స్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థుల సందడి..

విజేతలకు బహుమతుల ప్రదానం

చౌటుప్పల్, నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రోజ్ బడ్స్ పాఠశాల ప్రిన్సిపల్ జానీ బేగం ఆకాంక్షించారు. శనివారం దామెర లోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో బాలల దినోత్సవ





వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం ప్రిన్సిపల్ జానీ బేగం మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఆటపాటలు, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో సమాచార హక్కు.. బాధ్యతల బాటలో బైరు సైదులు గౌడ్..

ఆర్టీఐతో ప్రజల గొంతుకగా నిలవాలి..

జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు బైరు సైదులు గౌడ్‌కు

బిసి రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఘన సన్మానం..

ప్రజల్లో సమాచార హక్కుపై మరింత అవగాహన కల్పించాలి..

బీసీ రాజ్యాధికార సమితి నాయకులు..

నల్గొండ నవంబర్ 14,(ప్రజా జ్యోతి):

సమాచార హక్కు చట్టం (2005)ప్రజలకు ఒక బలమైన ఆయుధమని, ఆ చట్టం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెంపొందించడంతో పాటు ప్రజలకు అవసరమైన సమాచారం అందేలా కృషి చేయాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు కర్నాటి యాదగిరి ఆకాంక్షించారు. నల్గొండ జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన బైరు సైదులు గౌడ్‌ను బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. గత పదేళ్లుగా సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో పనిచేస్తూ ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఉంటూ సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న బైరు సైదులు గౌడ్ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. నూతన బాధ్యతల్లోనూ ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ, సామాన్యులకు సమాచార హక్కు చట్టం అందించే అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు



వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి బొగరి రామకృష్ణ, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ మార్గం సతీష్ కుమార్, సమాచార హక్కు వికాస సమితి జనరల్ సెక్రటరీ చిత్రం శ్రీనివాస్, వనమ ధనంజయ, కర్నాటి రామ్, లక్ష్మణ్, సల్లోజు మురళి, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవ వేళ విజ్ఞాన్ పాఠశాలలో విజ్ఞాన వెలుగులు

- విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేలా నూతన గ్రంథాలయం ప్రారంభం

ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణ తరగతులకు అనుగుణంగా పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులోకి

భువనగిరి,నవంబర్ 14(ప్రజాజ్యోతి)

బాలల దినోత్సవాన్ని పురస్క రించుకొని,భువనగిరిలోని విజ్ఞాన్ పాఠశాలలో నూతన గ్రంథాలయాన్ని పాఠశాల చైర్మన్ డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి శనివారం ప్రారంభించారు.విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై ఆసక్తి పెంపొందించి, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించే లక్ష్యంతో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రారంభించిన ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణ తరగతులకు అనుగుణంగా యూపీఎస్సీ, గ్రూప్స్, సివిల్ సర్వీసెస్ ఫౌండేషన్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ఈ గ్రంథాలయం విద్యార్థుల విజ్ఞాన వికాసానికి, పోటీ పరీక్షల్లో రాణించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల



కరస్పాండెంట్ పగిడాల పురేందర్ రెడ్డి,ప్రిన్సిపాల్ స్వాతి, వైస్ ప్రిన్సిపాల్ షైన్ ఆంటోనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో బీజేవైఎం నేత ముందస్తు అరెస్ట్

అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతులను నొక్కలేరు

నడిగూడెం, నవంబర్ 14, ప్రజాజ్యోతి:

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో బీజేవైఎం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రౌతు కళ్యాణ్‌ను నడిగూడెం పోలీసులు శనివారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను నొక్కలేరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని, పోలీసుల ద్వారా అణచివేత చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగదని రౌతు కళ్యాణ్ స్పష్టం చేశారు.



ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం..

- గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి, 14వ డివిజన్ కార్పొరేటర్ బొజ్జ శంకర్..

జానమ్మ-సత్తయ్య దంపతుల ఇంట గృహప్రవేశ సందడి..

నల్లగొండ టౌన్ నవంబర్ 14,(ప్రజా జ్యోతి):

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ మర్రిగూడలో కొయ్యగూరి జానమ్మ, సత్తయ్య దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, 14వ డివిజన్ కార్పొరేటర్ బొజ్జ శంకర్ హాజరై నూతన గృహాన్ని ప్రారంభించి, దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గురిజ వెంకన్న, గుమ్ముల నాగిరెడ్డి, సుంకరబోయిన మధు, మర్రి సత్తయ్య, గురిజ ఎల్లయ్య, జేరిపోతుల యాదయ్య, జేరిపోతుల శంకరయ్య, కొప్పోలు సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా రెవ.డా.శాంసన్ మామిడి జన్మదిన వేడుకలు



100 మంది పాస్టర్ల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 14(ప్రజా జ్యోతి):

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 5వ వార్డులో,సువెన్ కంపెనీ సమీపంలోని న్యూ లైఫ్ చర్చిలో న్యూ లైఫ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు,సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ రెవ.డా.శాంసన్ మామిడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి,బెతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో పలువురు మత పెద్దలు,పాస్టర్లు రెవ.డా.శాంసన్ మామిడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో,మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రెవ.డా.ఎం.ప్రభుదాస్, రెవ.పి.జాన్ మార్క్, రెవ. మిట్టగడుపుల హాజర్య, రెవ. డాక్టర్ సిహ్న, రెవ. జవహర్ పాల్, పాస్టర్ మాడుగుల సుందర్ రావు, హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు రెవ. మెసా దేవసహాయం, రెవ. మాతంగి పీటర్ తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో సుమారు 100 మంది పాస్టర్లు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు

రామన్నపేట నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరోద్దిన్ ఆధ్వర్యంలో భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆధునిక భారత నిర్మాణ శిల్పి భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రామన్నపేట పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిపిఎస్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం, విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఆధునిక భారతదేశ నిర్మాణానికి



విశేష కృషి చేశారని తెలిపారు.ముఖ్యంగా పిల్లలంటే నెహ్రూకు ఎంతో ఇష్టమని, అందుకే ఆయన జన్మదినమైన నవంబర్ 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని నమ్మిన నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయడం సంతోషకరమని



అన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, ఉప సర్పంచ్ మోడీ రమేష్, కాంగ్రెస్ నాయకులు బొడ్డు సాలయ్య, గోదాసు గ్రీలు, మీర్జా బషీర్, మొహమ్మద్ నాసర్, మొహమ్మద్ బషీర్ దౌల, మొహమ్మద్ అన్వర్, కొరిగే శేఖర్, మొహమ్మద్ అంజాద్, నగర కంటి సుదర్శన్, మీర్జా నజీర్ బేగ్, మహమ్మద్ రిజ్వాన్, లవరం సాయి, ఈ నాయతుల్లా బేగ్, కక్కిరేణి రవీందర్, చంద్రారెడ్డి, సైదులు, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో ప్రజలకు పారదర్శక పాలన

- ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం

పొందడం ప్రతి పౌరుడి హక్కు.. - ఆర్టీఐపై ప్రజల్లో అవగాహన పెంచుతాం..- జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బైరు సైదులు గౌడ్

నల్గొండ, నవంబర్ 14 (ప్రజాజ్యోతి):

:సమాచార హక్కు చట్టం,2005 (ఆర్టీఐ) ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని నల్గొండ జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బైరు సైదులు గౌడ్ అన్నారు. రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసి తనకు నియామక పత్రం అందజేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి ప్రభుత్వ కార్యాలయాల్లోని ప్రజా సమాచారాన్ని చట్ట పరిధిలో కోరే హక్కు ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు, వాటి అమలు, నిధుల వినియోగం, ప్రజా సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, ఆర్టీఐ దరఖాస్తు విధానంపై గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకుని అవినీతి రహిత, పారదర్శక పాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు

రామన్నపేట నవంబర్ 14 (ప్రజా జ్యోతి)

మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు





నెహ్రూ తో పాటు భారతమాత, ఇతర జాతీయ నాయకుల, రైతులు వివిధ వర్గాల ప్రజల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాల నుండి విద్యార్థులు ర్యాలీగా వెళ్లి స్థానిక పాత బస్టాండ్ లో ఉన్న నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి సురేష్, అకాడమీ డైరెక్టర్ జేవిఎన్ఎస్ మణి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పితామహుడు ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది

రామన్నపేట నవంబర్ 14 ప్రజా జ్యోతి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించడం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య గ్రంథాలయ వారోత్సవాల్ని ప్రారంభించారు. అదేవిధంగా గ్రంథాలయ పితామహుడు ఎస్. ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు, అటువంటి గ్రంథాలయాల్ని గ్రామ గ్రామాన నెలకొల్పినప్పుడే ప్రతి ఒక్కరు విజ్ఞానవంతులై ఉత్తమ పౌరులుగా రాణిస్తారని అన్నారు. కళాశాల గ్రంథాలయంలో అమూల్యమైన పుస్తకాలు చాలా ఉన్నాయని, విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను కూడా చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. గ్రంథపాలకులు డాక్టర్ రాచమళ్ళ శ్రీను మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్నటువంటి వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు,



అకడమిక్ పుస్తకాలు, మ్యాగజైన్లు, జర్నల్స్, వార్తాపత్రికలు అందుబాటులో ఉన్నాయని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తును పెంపొందించుకోవాలని అన్నారు. వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, పాటలు, పుస్తక పఠనం మొదలగు పోటీలను విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, ఎం. అనిత, డాక్టర్ పి.బ్రహ్మం, యస్. బాలరాజు, బి.అమర్, జె. నరేష్,టి. రాంబాబు,బి. శ్రీదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.